# పరిష్కారం

నందనవనం జయలక్ష్మి

"కాలేజీ బ్యూటీ"గా పేరు గాంచిన శ్యామలకి ఇంటర్ చదువుతుండగా బియ్యే చదువుతున్న రాజారావ్‌తో పరిచయం అయింది. ఒకనాడు తన గదిలో కూర్చొని తన స్నేహితురాలికి వుత్తరం వ్రాస్తోంది. డియర్ నిర్మలా, రాజాను గురించి నీకు యిదివరకే వ్రాశాను. కాలేజీ మేట్సుగా వున్న మా యిద్దరి స్నేహం క్రమేణా విడరాని, విడువలేని అనుబంధంగా మారింది. నిర్మలమైన ప్రేమతో ఒకరికొకరు ఆరాధించుకుంటూ. భవిష్యత్ గురించి కలలు కంటూండే వాళ్ళం. రోజూ సినిమాకో, షికారుకో రాజాతో వెళ్ళందే నాకేమీ తోచేదికాదు. అతడు తండ్రికి ఒక్కడే కొడుకు. ఒక చెల్లెలు వుందట. నేను నాన్నగారికి ఒక్కతే అమ్మాయిని నాన్నగారికి మా యిద్దరికి పరిచయం, ప్రేమా అన్నీ తెలుసు. రాజాకి వుద్యోగం రాగానే మా యిద్దరికీ వివాహం చెయ్యాలని అనుకుంటున్నారు. "రాజాకు నీ మీద నిజమైన ప్రేమ వున్నదని నీకెలా తెలుసు" అని నీవు యిదివరకు వ్రాశావ్? పిచ్చి నిమ్మీ ఒక వుదాహరణ చెప్పనా "ఒకనాడు కాలేజీలో ఎవరో నాకు ఒక ఆకాశరామన్న ప్రేమలేఖ వ్రాస్తే, వాడెవడో ఆరాతీసి వాడిని చావగొట్టి వాడిచేత నాకు క్షమాపణ చెప్పించే వరకు నిద్రపోలేదు. అంతెందుకు పోయిన సంవత్సరం నాకు పరీక్షల్లో జ్వరం తగిలితే జ్వరం తగ్గేవరకు నాకు ఎన్ని సేవలు చేశాడో నీకెలా వ్రాసేది? నే నంటే ఎంత ప్రేమ వుందో రాజాకి నీకెలా తెలుస్తుంది? పెళ్ళంటూ జరిగితే రాజాతోనే జరుగుతుంది. అన్నట్టు నిన్ననే రాజావద్ద నుంచి ఉత్తరం వచ్చింది. తనకు వుద్యోగం దొరికిందనీ, తొందర్లో వాళ్ళనాన్నకు మా విషయం తెలిపి తొందరలోనే వివాహం చేసుకుంటాననీ వ్రాశాడు. అందుకని నిన్ననే రాజా కిష్టమైన ధర్మేంద్ర సినిమాకు వెళ్ళివచ్చాము. పెళ్ళి కాగానే హనీమూన్‌కి ఉత్తర హిందూస్తానం వెళ్ళాలి. రాజాతో కలిసి పౌర్ణమినాటి వెన్నెల్లో మిలమిలా, తళతళా మెరిసిపోయే పాలరాతి తాజమహల్‌ను కన్నుల పండువగా చూడాలి. రాజాతో పరిచయ

మైననాటినుండి నాకో కోర్కె అజ్ఞాతంగా మెదలుతోంది. పెళ్ళయిన రోజు మొదటి రాత్రి నాడు రాజాచేత బతిమలాడించుకొని నా కోర్కె చేప్పాలి. నాన్నగార్ని రాజా కోర్కె మేరకు వాళ్ళ తండ్రిగారి వద్దకు పంపాలి రేపే.

నీ వుద్యోగం ఎలా వుంది? టీచరుగా నీవు చక్కగా రాణిస్తావనే నా నమ్మకం. తొందరలోనే శుభలేఖ పంపుతాను"

నీ ప్రియమైన శ్యామల.

ఆ తర్వాత పది రోజులకు శ్యామల సినిమాకు వెళ్ళి తిరిగి యింట్లోకి వెళ్తుంటే తండ్రి లాయర్ విశ్వనాథంగారు తన ఫ్రెండు సుబ్బారావు గారితో ఏదో మాట్లాడుతూంటే అక్కడే గది ముందు నిలబడి ఆ మాటలు వినసాగింది ఆత్రుతతో,

"శ్యామలకీ, రాజాకిగల స్నేహం ప్రేమగా మారినందుకు నాకు సంతోషంగానే వున్నది. తల్లి పోయినప్పటి నుండి నా బంగారు తల్లిని అల్లారుముద్దుగా పెంచుకున్నాను. వినయవతి, విద్యావతి అయిన శ్యామల తనకు యిష్టమైన వరుడ్ని ఎంచుకున్నందులకు చాలా సంతోషించాను. నాకున్న మేడా, బ్యాంకులో డబ్బు అంతా నా తర్వాత శ్యామలదే కదా! రాజాకు వుద్యోగం వచ్చినట్లు శ్యామలకు వుత్తరం రాగనే నేను వాళ్ళ వూరు వెళ్ళాను వాళ్ళ తల్లిదండ్రులతో మాట్లాడానికి.

రాజా తండ్రి గెజిటెడ్ ఆఫీసర్, నేనేసరా నా అంతటనేనే పరిచయం చేసుకొన్నాను. నన్ను చాలా మర్యాద చేశారు, చాలా ఆప్యాయంగా మాట్లాడారు. రాజారావ్, శ్యామల ప్రేమవిషయం చెప్పాను. వివాహానికి ముహూర్తం పెట్టామన్నాను. ఆయన అన్నిటికి సరే నన్నారు, అలాంటితండ్రి వుండడం రాజా అదృష్టమనుకొన్నాను, ఉన్నట్లుండి "సరేగాని బావగారూ! రాజాకి కట్నం ఎంత యిస్తున్నారు!" అన్నారు. నేను ఉలిక్కిపడ్డాను. "రాజారావ్ ఇదివరకు కట్నం తీసుకోను అన్నాడుగదండీ" అన్నాను. మళ్ళీ "నాకు కట్నాలు యివ్వడం పుచ్చుకోడం అనేది యిష్టం లేదు. నాకు ఒక్కతే పిల్ల నా తదనంతరం నా ఆస్థి డబ్బు అంతా అమ్మాయిదే గదా! కట్నం రూపేణా డబ్బు యివ్వడం నాకు అసహ్యం పెళ్ళి గ్రాండుగా చేస్తాను, లాంఛనాలకి లోటు రానివ్వను!

వెంటనే "బావగారూ! మీ ఉద్దేశ్యాలు. అభిప్రాయాలు చాలా బాగున్నాయి. మా అబ్బాయికి లక్షయిచ్చి పిల్లనిస్తామని రోజూ ఎంతోమంది వస్తున్నారు. మేము ఒక ఆడపిల్ల పెళ్ళి చెయ్యాలి ఏదో మీరు మనపిల్లలు పెళ్ళికి ముందరే ప్రేమించుకొన్నారని గూడా అంటున్నారు. కాబట్టి మీ అమూల్య అభిప్రాయాలతో యిప్పుడు పనిలేదు. మీరు భాగ్యవంతులు. ఓ లక్ష చెక్కు యిలా పారవెయ్యండి. ఈ డబ్బు మీకొక లెక్కలోనిది కాదు.

దాంతో నాకు రోషం వచ్చింది. "ఏమండీ లక్ష రూపాయలకు మీ

అబ్బాయిని అమ్ముకోబోతున్నారా? ఒక బాధ్యతగల ప్రభుత్వ అధికారిఅయి మీరు యిలా మాట్లాడటం బాగుందా? నేను కొన్ని సిద్ధాంతాలు గల మనిషిని, కట్నం యిచ్చేవాడు పుచ్చుకుండేవాడు యిద్దరు నీచులనే నా అభిప్రాయం. రాజా స్వభావాలు, రాజా గుణాలుచూసి శ్యామల అతని భార్య అయితే బాగుంటుందని ఎంతో ఆశించాను కాని ఇపుడు నా ఉద్దేశ్యం మార్చుకుంటున్నాను. వాళ్ళిద్దరికి కళ్యాణగీత వుంటే వివాహం అవుతుంది. లేకపోతేలేదు నేను వెళ్ళొస్తాను" అనిచెప్పి విన్నతే అక్కడినుండి వచ్చాను. తండ్రి మాటలన్నీవిని తనగదిలోకి వెళ్ళిపోయింది శ్యామల. ఆ రాత్రి తండ్రితో "నాన్నా తండ్రిని ఎదిరించి అయినా రాజా నన్ను వివాహం చేసుకుంటాడు. అతనికి నా మీదగల ప్రేమ అపారంనాన్నా. ఈ విషయాలన్నీ మీరే అతనికి వ్రాయండి" అన్నది. వారంరోజులు గడిచాక రాజారావ్ దగ్గరనుండి శ్యామలకు వుత్తరం వచ్చింది. అందులో ఇలా "మీ నాన్నవ్రాసిన వుత్తరం, మా నాన్న వ్రాసిన వుత్తరం రెండు నాకు చేరాయి. అవి చదువుతుంటే నాబుర్ర గిర్రున తిరుగుతోంది, నాకు కట్నం తీసుకోడం నిజంగా యిష్టంలేదు శ్యామలా! కాని మానాన్న చెప్పినమాటలు విన్నావుగదా! అంతడబ్బుగల మీనాన్న మానాన్న కోరినడబ్బు యివ్వడానికి అంత మొండి పట్టుదల ఎందుకు మన సుఖమేగదా మీ నాన్నకు కావలసినది? ఇప్పుడు ఆస్తివంతా నా పేరువ్రాసి మీనాన్న మన దగ్గరే వుండవచ్చుగదా? ఇంకెవరో వచ్చి లక్షకట్నం యిస్తానన్నారని, ప్రేమాలేదూ, దోమాలేదు అని మానాన్న వ్రాశాడు. నాన్నమాట యింతవరకు ఏ విషయంలోను దిక్కరించలేదు. నిన్ను వదులుకోలేను శ్యామలా. ఈ సమస్యకు పరిష్కారం నెలాగో నువ్వేనాకు తెలియజేయి. మీ నాన్న మొండితనం కాస్త సడలించుకొనమని నా కొరకు నీవు మీ నాన్నని అడుగు. నువ్వులేనిది నాకు బ్రతుకేలేదు శ్యామలా, ఏం చెయ్యాలో నువ్వేవ్రాయి" రాజావుత్తరాన్నిపదిరోజులు రోజూ పదిసార్లు చదువుకొన్న శ్యామల కళ్ళల్లోనుండి జలజల కన్నీరు కారింది గుడ్డిగా అలాంటి పిరికివానికి తన మనసు అర్పించినందులకు. మూర్ఖత్వంగా యిద్దరు మగవాళ్ళ పంతాలకు తన ప్రేమను తానే సమాధిచేయ్యాలనుకుంది. ఆ రాత్రంతా ఆలోచించి శ్యామలను రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుందామని వచ్చిన రాజారావ్‌కి ఆ రాత్రే తనప్రిన్సిపల్ వల్ల శ్యామల జీవితం ఏమవుతుందో నమకొని లక్ష రూపాయలు శ్యామల, రాజారావుల పేర బ్యాంక్‌లో వేసి వివాహానికి ముహూర్తం పెట్టుకుందామని నిశ్చయించుకున్న లాయరు విశ్వనాథం గారికి మర్నాటి ఉదయం తన ఆత్మహత్యకు ఎవరుబాధ్యులు కారన్న వుత్తరం టేబిల్‌మీదను శ్యామల శవం మాత్రిలోనూ కనిపించాయి. ★